సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 9 । ఏప్రిల్ । 2025

గరిష్టం / కనిష్టం
39° / 25°

వాతావరణం

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం వేళ కొన్నిచోట్ల గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైభవంగా మహదాశీర్వచనం



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు వేద పండితులు మహదాశీర్వచనం అందజేసే కార్యక్రమాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని తిలకించిన భక్తులకు సకల సౌభాగ్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుతూ ఈ క్రతువు నిర్వహిస్తున్నట్లు వేద పండితులు వివరించారు. కల్యాణం జరిగిన మూడోరోజున స్వామివారికి మహదాశీర్వచనం అందజేయడం అనాధిగా వస్తున్న సంప్రదాయమని తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి పూలు, పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ ఎల్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

చాతకొండ బెటాలియన్ అభివృద్ధికి రూ.20 లక్షలు



కమాండెంట్‌కు లేఖ అందజేస్తున్న ఎంపీ రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్/కొత్తగూడెంఅర్బన్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చాతకొండలోని ఆరో బెటాలియన్‌లో అభివృద్ధి పనుల కోసం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తన ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.20 లక్షలు కేటాయించారు. ఈ మేరకు నిధుల కేటాయింపు లేఖను బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్‌రెడ్డి, ఆర్‌ఐ జీ.వీ.రామారావుకు మంగళవారం ఖమ్మంలో అందజేశారు. ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేస్తే బెటాలియన్‌లో సెల్యూటింగ్ డయాస్, గ్యాలరీ నిర్మాణ పనులు చేపడతామని వారు వెల్లడించగా, ఎంపీ రూ.20లక్షలు కేటాయించారు. ఈ సందర్భంగా ఎంపీకి కమాండెంట్ కృతజ్ఞతలు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

సింగరేణి(కొత్తగూడెం): పాల్వంచ డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పాన శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేపీఆర్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్‌లో 25 ఖాళీలు, ముత్తూట్ మైక్రో ఫైనాన్స్ కొత్తగూడెం బ్రాంచ్‌లో 20 ఖాళీల భర్తీకి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు.

కార్మికుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

సింగరేణి సీఎంఓ కిరణ్ రాజ్‌కుమార్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికుల ఆరోగ్య పరిరక్షణే సంస్థ ధ్యేయమని సీఎంఓ కిరణ్ రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సంస్థ నిబంధనల మేరకు కార్పొరేట్ మెడికల్ బోర్డును పారదర్శకంగా నిర్వహిస్తామని, దళారీ వ్యవస్థను అరికడతామని తెలిపారు. కార్మికులకు ఏదైనా జబ్బు చేస్తే సకాలంలో సరైన మందులు అందించేలా ఏడు ఏరియాల్లోని 21 డిస్పెన్సరీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేస్తామని వివరించారు. ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా సింగరేణి ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందించేలా కృషి చేస్తామని అన్నారు. రామగుండం రీజియన్ ఆస్పత్రిలో కార్డియో క్యాత్‌లాబ్ ఏర్పాటు చేసి గోల్డెన్ హవర్ సేవలు అందించేందుకు రూ.13 కోట్లతో పరికరాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. సింగరేణి ఉద్యోగులు, కార్మికుల కుటుంబాల్లో గర్భిణుల డెలివరీ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, తప్పని పరిస్థితుల్లోనే ఆపరేషన్ చేస్తామని పేర్కొన్నారు.

జర్నీ.. జరభద్రం

ఉమ్మడి జిల్లాలో ఇటీవల జరుగుతున్న ఆర్టీసీ బస్సు ప్రమాదాలు ప్రయాణికులను కలవరపాటుకు గురి చేస్తున్నాయి. ఆర్టీసీపై నమ్మకంతో ప్రయాణికులు ఆదరిస్తుండగా.. అధికారులు సైతం అంతేస్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ ప్రమాదాలను పూర్తిస్థాయిలో అరికట్టలేకపోతున్నారు. రహదారులపై విపరీతమైన రద్దీ పెరగడం, బస్సుల సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కుతుండడానికి తోడు కొందరు డ్రైవర్ల నిర్లక్ష్యం ఈ ప్రమాదాలకు కారణమవుతోంది. ఈ ఏడాది మూడు నెలల కాలంలో ఖమ్మం రీజియన్ పరిధిలో 18 ప్రమాదాలు జరగగా.. ఎనిమిది మంది మృతి చెందారు. ఈ ప్రమాదాలు ఎక్కువగా అద్దె బస్సుల కారణంగానే జరగడంతో డ్రైవర్లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఉండడం లేదనే చర్చ సాగుతోంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



గత నెల 31న వైరా వద్ద ప్రమాదానికి గురైన మణుగూరు డిపో బస్సు (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో కలవరపెడుతున్న బస్సు ప్రమాదాలు

- రద్దీకి అనుగుణంగా పెరగని బస్సుల సంఖ్య
- ఫలితంగా డ్రైవర్లకు ఓటీ.. అద్దె బస్ డ్రైవర్లకు శిక్షణ నామమాత్రమే

ఖమ్మం రీజియన్‌లో కేటగిరీల వారీగా బస్సులు

రాజధాని	36
లహరి ఏసీ	04
లహరి నాన్ ఏసీ	06
సూపర్ లగ్జరీ	87
డీలక్స్	40
ఎక్స్‌ప్రెస్	182
పల్లెవెలుగు	192
జేఎన్ఆర్‌యూఎం	05
మినీ బస్సులు	04
మొత్తం	556

సరిపడా బస్సులేవీ?

మహాలక్ష్మి పథకం ద్వారా రీజియన్‌లో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అందుకు అనుగుణంగా బస్సులు మాత్రం సమకూరలేదు. ఒకటి, అరా బస్సులను డిపోలకు కేటాయించడంతో ఒక్కో బస్సులో 60 – 80 మంది వరకు ప్రయాణిస్తున్నారు. కొన్ని రూట్లలో రాత్రి ఏడు గంటలు దాటాక అరకొర సర్వీసులు ఉండడంతో రద్దీ మరింత పెరుగుతోంది. ఇక ప్రయాణికుల వినతితో డ్రైవర్లు అన్నిసార్లు కాకపోయినా కొన్నిసార్లు ఆపుతూ వెళ్లాల్సి రావడంతో గమ్యస్థానం చేరే సరికి ఆలస్యమవుతోంది. ఆపై మళ్లీ తెల్లారి డ్యూటీ ఉండడం.. ఓవర్ టైమ్ డ్యూటీలువేస్తుండడంతో తగినంత విశ్రాంతి లభించక ఏకాగ్రత తగ్గుతోంది.

అద్దె బస్సులే అధికం

జిల్లాలో అధికంగా అద్దె బస్సులే ప్రమాదాలకు గురవుతున్నాయి. వీటి డ్రైవర్లు నిర్లక్ష్యంగా నడుపుతున్నారని, ఓవర్ టేక్ సమయాన తగిన జాగ్రత్తలు తీసుకోకపోగా.. ఫోన్‌లో మాట్లాడుతూ బస్సు నడుపుతున్నారని ప్రయాణికులు చెబుతున్నారు. ఇంకొందరు డ్రైవర్లు ఇయర్ ఫోన్లు పెట్టుకుని పాటలు వింటూ డ్రైవింగ్ చేస్తుండడం కూడా ప్రమదాలకు కారణమవుతోందని తెలుస్తోంది. గతంలో అద్దె బస్సు డ్రైవర్లకు వరంగల్‌లో శిక్షణ ఇచ్చినా, ఇప్పుడు ఆ పరిస్థితులు లేక నైపుణ్యం కొరవడుతోంది.

అతి వేగం..

అతివేగం వాహనదారుల ప్రాణాల మీదకు తీసుకొస్తోంది. కరోనా తర్వాత సొంత వాహనాల సంఖ్య పెరగగా, వాహనాల రద్దీ అదే స్థాయిలో నమోదవుతోంది. వ్యక్తిగత వాహనాలను నడిపే పలువురికి డ్రైవింగ్ సామర్థ్యం లేకపోవడం, మరోవైపు ఆర్టీసీ బస్సుల వేగం ఎక్కువగా ఉండడం, అద్దె బస్సుల డ్రైవర్లలో కొందరి నిర్లక్ష్యం తరచుగా ప్రమాదాలకు తావిస్తోంది.

మూడు నెలల్లో 18 ప్రమాదాలు

ఖమ్మం రీజియన్ పరిధిలోని ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు డిపోల పరిధిలో ప్రతిరోజు 556 బస్సులు.. 2.38 లక్షల కి.మీ. మేర రాకపోకలు సాగిస్తాయి. మొత్తంగా 238 అద్దె బస్సులు ఉండగా, అన్నింటా కలిపి 737 మంది డ్రైవర్లు, 865 మంది కండక్టర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు ఆర్టీసీలో 18 రోడ్డు ప్రమాదాలు జరగగా.. జనవరి, ఫిబ్రవరిల్లో మూడేసి ప్రమాదాలు జరిగాయి. కానీ మార్చిలోనే ఏకంగా 12 ప్రమాదాలు జరిగాయి. అన్ని ఘటనల్లో కలిపి ఎనిమిది మంది మృతిచెందగా.. పలువురు గాయపడ్డారు.

డ్రైవర్ల విధినిర్వహణపై పరిశీలన



బస్సు ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటూనే డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నాం. అలాగే, ప్రతిరోజు డ్యూటీకి వెళ్లే సమయాన ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా బస్సు నడుపుతామని ప్రతిజ్ఞ చేయిస్తున్నాం. అంతేకాక పాల్వంచ పెద్దమ్మగుడి నుంచి ఖమ్మం వరకు కొన్ని ప్రాంతాల్లో అధికారులతో పరిశీలన చేయిస్తున్నాం. డ్రైవర్లు బస్ ఏ వేగంతో నడుతున్నారు, ఇయర్ ఫోన్‌లో పాటలు వింటున్నారా, ఫోన్‌లో మాట్లాడుతున్నారా అనేది పరిశీలించాక డిపో మేనేజర్లకు నివేదిక పంపిస్తాం. ఆపై వారు దిద్దుబాటు చర్యలు తీసుకుంటారు.

– ఎ.సరిరాం, ఖమ్మం రీజినల్ మేనేజర్

డిపోల వారీగా బస్సుల సంఖ్య	ఖమ్మం	మధిర	సత్తుపల్లి	భద్రాచలం	కొత్తగూడెం	మణుగూరు	ఇల్లెందు
	136	62	107	97	61	70	23

పేదలకు పక్కా ఇళ్లే లక్ష్యం

- లబ్ధిదారుల ఇష్ట ప్రకారమే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవచ్చు
- కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడి
- కోయగూడెంలో ఎమ్మెల్యే, పీఓతో కలిసి శంకుస్థాపన



సురేష్ ఇంట్లో భోజనం చేస్తున్న కలెక్టర్ పాటిల్, పీఓ రాహుల్, ఎమ్మెల్యే కనకయ్య తదితరులు

టేకులపల్లి: పేదలంతా పక్కా ఇళ్లల్లో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన లబ్ధిదారులు తమకు నచ్చినట్టుగానే నిర్మించుకోవచ్చని చెప్పారు. మండలంలోని కోయగూడెంలో మంజూరైన 303 ఇళ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌తో కలిసి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే పట్టుదలతో రూ.15.15 కోట్లతో 303 ఇళ్లు మంజూరు చేశామన్నారు. మొత్తం నాలుగు విడతల్లో రూ.5 లక్షలు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన, సహజ సిద్ధమైన ఇటుకలు, మెటీరియల్ వినియోగించాలని సూచించారు. రాజీవ్ యువ వికాసం పథకానికి నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం రాగానే సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. పేదలకు ఉచితంగా సన్న బియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రభుత్వం వెనకడుగు వేయబోదని స్పష్టం చేశారు.

సన్న బియ్యంతో లంచ్..

రేషన్ దుకాణాల ద్వారా పేదలకు ఉచితంగా సన్న బియ్యం అందిస్తున్న నేపథ్యంలో మండలంలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన గుమ్మడి సురేష్ – శశికళ దంపతుల ఇంట్లో కలెక్టర్, ఎమ్మెల్యే, పీఓ తదితరులు మధ్యాహ్న భోజనం చేశారు. ఎమ్మెల్యేతో పాటు అధికారులు తమ ఇంటికి రావడంతో సురేష్ దంపతులు హర్షం వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో హౌసింగ్ పీడీ శంకర్, ఏఈ డేవిడ్, ఏటీడీఓ రాధ, సివిల్ సప్లై డీటీ పాషా, డీఎస్పీ చంద్రభాను, తహసీల్దార్ నాగభవానీ, ఎంపీడీఓ రవీంద్రరావు, మాజీ సర్పంచ్ కోరం ఉమ, కోరం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి బిడ్డ వాదనా పటిమ

- దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల కేసులో ఎన్ఐఏ తరఫున వాదించిన విష్ణువర్ధన్‌రెడ్డి
- నిందితులు ఐదుగురికి ఉరిశిక్ష విధించిన హైకోర్టు
- ఎన్ఐఏ పీపీగా రాణిస్తున్న రెడ్డిపాలెం లాయర్



భద్రాద్రి రామాలయంలో విష్ణువర్ధన్‌రెడ్డికి జ్ఞాపిక ఇస్తున్న స్థానికులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసులో ఐదుగురు నిందితులకు తెలంగాణ హైకోర్టు మంగళవారం మరణ శిక్ష విధించింది. ఈ కేసులో ఎన్ఐఏ తరఫున వాదించింది జిల్లా న్యాయవాది పత్తి విష్ణువర్ధన్‌రెడ్డి కావడం విశేషం. దిల్‌సుఖ్‌నగర్‌లో ప్రసిద్ధి చెందిన సాయిబాబా గుడికి వచ్చే భక్తులే లక్ష్యంగా 2013 డిసెంబర్ 21న బాంబు పేల్చగా 18మంది మృతి చెందారు. ఇదే ఘటనలో మరో 131 మంది గాయపడ్డారు. ఈ కేసులో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) ప్రత్యేక న్యాయస్థానం 2016 డిసెంబర్ 13న ఐదుగురు నిందితులకు మరణశిక్ష ఖరారు చేసింది. దీంతో నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. తొమ్మిదేళ్లుగా ఈ కేసుపై విచారణ కొనసాగుతుండగా, 18 కుటుంబాల ఆవేదనకు కారణమైన నిందితులకు ఏ శిక్ష పడుతుందనే ఉత్కంఠ రాష్ట్ర వ్యాప్తంగా నెలకొంది. కాగా, ఈ కేసులో నిందితులు తప్పించుకునేందుకు అవకాశం ఇవ్వకుండా కోర్టు ముందు బూర్గంపాడు మండలం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన పి.విష్ణువర్ధన్‌రెడ్డి సమర్థమైన వాదనలు వినిపించారు. దీంతో దిల్‌సుఖ్‌నగర్ జంట బాంబుపేలుళ్ల కేసులో ఐదుగురు నిందితులకు హైకోర్టు కూడా ఉరిశిక్ష ఖరారు చేసింది.

రెడ్డిపాలెం టు హైకోర్టు

విష్ణువర్ధన్‌రెడ్డి స్వస్థలం బూర్గంపాడు మండలం రెడ్డిపాలెం కాగా, ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియంలో చదివారు. ఆ తర్వాత జక్కం పెద్ద బుచ్చయ్య మెమోరియల్ విద్యాసంస్థలో, ఆపై ఏలూరులోని సీఆర్.రెడ్డి కాలేజీలో ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం చదివారు. ఆ తర్వాత న్యాయవాద వృత్తిలోకి వచ్చిన విష్ణువర్ధన్‌రెడ్డి ఉమ్మడి ఏపీ హైకోర్టులో 2000 నుంచి వాదనలు వినిపిస్తున్నారు. ఈ క్రమంలో సహాయక సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియాగా కేవలం 35 ఏళ్ల వయసులోనే 2010లో ఎంపికయ్యారు. ఆ తర్వాత 2014లో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ)కి పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ)గా నియమితులయ్యారు. దేశరక్షణకు సంబంధించిన వ్యవహారాల్లో ప్రభుత్వం తరఫున ప్రతిభావంతంగా వాదనలు వినిపిస్తూ దోషులకు శిక్ష పడేలా చూశారు.

మృతుల్లో భద్రాద్రి వాసి..

2013 డిసెంబర్ 21న దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగిన బాంబుదాడిలో మృతి చెందిన వారిలో భద్రాద్రి జిల్లా యువకుడు కూడా ఉన్నాడు. ఈ ఘటనలో కొత్తగూడెం పట్టణానికి చెందిన అజాజ్ అహ్మద్ (18) ప్రాణాలు కోల్పోగా, అప్పుడు ఆయన పాలిటెక్నిక్ చదువుతున్నాడు.

కీలక కేసుల్లో వాదనలు

దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్లకు సంబంధించి తొలుత ఎన్ఐఏ కోర్టులో, ఆ తర్వాత హైకోర్టులో వాదనలు వినిపించిన విష్ణువర్ధన్‌రెడ్డి ఐదుగురు నిందితులకు ఉరిశిక్ష పడేలా చేశారు. అంతకు ముందు ఎన్ఐఏ తరఫున గోకుల్ చాట్, లుంబిని పార్క్ బాంబు పేలుళ్ల ఘటనలోనూ ఆయన ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించారు. తెలంగాణలో సంచలనం సృష్టించిన డ్రగ్స్ కేసు పూరి జగన్నాథ్, చార్మిపై నమోదు కాగా, ఆ కేసులోనూ ప్రభుత్వం తరఫున వాదించారు. 2019లో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఎన్నికైన విష్ణువర్ధన్‌రెడ్డి, తెలంగాణ నుంచి 47 వేల మంది లాయర్లకు ఇండియా బార్ కౌన్సిల్‌లో ప్రతినిధిగా ఉన్నారు. నల్సార్ వర్సిటీకి ఎగ్జిక్యూటివ్ అకడమిక్ కౌన్సిల్ మెంబర్‌గా 2019 నుంచి, నేషనల్ లా యూనివర్సిటీ, బెంగళూరులోని అకడమిక్ కౌన్సిల్‌లో సభ్యుడిగా కొనసాగుతున్నారు. కాగా, విష్ణువర్ధర్‌రెడ్డి తండ్రి పత్తి నర్సిరెడ్డి అప్పట్లోనే బీకాం పూర్తి చేసి ఐటీసీ, హెవీ వాటర్ ప్లాంట్‌లో కాంట్రాక్టర్‌గా వ్యవహరించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న పీఓ రాహుల్

టేకులపల్లి: ఉద్దీపకంలోని అన్ని అంశాలు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించి వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఉపాధ్యాయులకు సూచించారు. టేకులపల్లి పంచాయతీ పరిధిలోని కాలనీతండా ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఉద్దీపకంలోని వివిధ అంశాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. దీంతో సంతృప్తి చెందిన పీఓ విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఆయన వెంట ఇల్లెందు గిరిజన సంక్షేమ సహాయ అధికారి (ఏటీడీఓ) సూర్ణపాక రాధమ్మ, కాంప్లెక్స్ హెచ్ఎం బి.అమర్ సింగ్, పాఠశాల ఉపాధ్యాయురాలు ఎల్.విజయ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యుదుత్పత్తి చేయాలి

- జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా
- పాల్వంచ పర్యటనలో ఆద్యంతం ఆంక్షలు



మణుగూరురూరల్ : బీటీపీఎస్‌లో అధికారులతో మాట్లాడుతున్న సందీప్‌కుమార్ సుల్తానియా

మణుగూరు రూరల్/పాల్వంచ: బీటీపీఎస్, కేటీపీఎస్‌ల నుంచి నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి చేయాలని టీజీ జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన మణుగూరు బీటీపీఎస్, పాల్వంచలోని కేటీపీఎస్ ప్లాంట్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలను విద్యుత్ కోతల నుంచి విముక్తి చేసేందుకు, విద్యుత్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో పలు పవర్ ప్రాజెక్టులు నిర్మిస్తూ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేలా చర్యలు చేపడుతోందన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలకు విద్యుత్ సరఫరా చేసేంతగా తెలంగాణ ఎదిగిందని తెలిపారు. కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో జెన్‌కో ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించి శిక్షణ పొందుతున్న ఇంజనీర్లతో ముఖాముఖిగా మాట్లాడారు. శిక్షణతో సాంకేతిక పరిజ్ఞానం ఎంత మేర కలిగిందనే అంశంపై ఆరా తీశారు. ఆ తర్వాత కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. బీటీపీఎస్ రైల్వే లైన్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలని జరుగుతున్న ఆందోళన, తీసుకోవాల్సిన నిర్ణయాలపై కలెక్టర్‌తో చర్చించినట్లు సమాచారం.

ఆంక్షలతో పలువురి అసహనం..

సీఎండీ పర్యటనలో ఆద్యంతం ఆంక్షలు విధించడంతో పలు కార్మిక, ఇంజనీరింగ్ ఉద్యోగ సంఘాల వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సీఎండీ తొలుత గెస్ట్‌హౌస్‌కు చేరుకోగా కవరేజ్ కోసం వెళ్లిన మీడియాను సైతం లోనికి అనుమతించలేదు. ఎంతో కాలంగా విద్యుత్ సంస్థల్లో నెలకొన్న సమస్యలపై సీఎండీని కలిసేందుకు ప్రయత్నించిన సంఘాల వారిని సైతం లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. సీఎండీ పర్యటన గతానికి భిన్నంగా సాగడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఆయా కార్యక్రమాల్లో జెన్‌కో డైరెక్టర్లు అజయ్‌కుమార్, సచ్చిదానందం, బి.లక్ష్మయ్య, కేటీపీఎస్‌చ బీటీపీఎస్ సీఈలు రత్నాకర్, పి.శ్రీనివాసబాబు, ప్రభాకర్ రావు, బి.బిచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రతపై శిక్షణ ఇవ్వాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఆహార భద్రతపై శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్లో నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం లభించేలా నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఫుడ్ పాయిజన్ కేసులు ఎన్ని నమోదవుతున్నాయో పరిశీలించాలని వైద్యాధికారులకు సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలల హాస్టళ్లలో నిరంతరం పర్యవేక్షించాలని, ఏమైనా సమస్యలు ఉంటే నివేదికలు అందజేయాలని చెప్పారు. ఈనెల 8 నుంచి 22 వరకు పోషణ పక్షోత్సవాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, డీడబ్ల్యూఓ లెనీనా, డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్, డీఏఓ బాబురావు, డీఎస్ఓ రుక్మిణి, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, పరిశ్రమల శాఖాధికారి పృథ్వీ, వినియోగదారుల సంస్థ సభ్యులు శ్యామ్‌కుమార్, సంపత్‌కుమార్, కృష్ణారెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ జితేష్ వి పాటిల్ తనిఖీ చేశారు. ఈవీఎం, వీవీ ప్యాట్లు ఉన్న గదిని, సీసీ కెమెరాలను పరిశీలించారు. గోడౌన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేకుండా ఎవరినీ లోనికి అనుమతించవద్దని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్, సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చి, పుచ్చు గెలలు..!

- పామాయిల్ ఫ్యాక్టరీకి తీసుకొస్తున్న రైతులు
- నాణ్యత లేక నూనె దిగుబడిపై ప్రభావం
- పట్టించుకోని ఉద్యోగులు, అధికారులు



పక్వానికి రాని గెల



చచ్చు గెల

అశ్వారావుపేట: వేసవి కాలంలో పామాయిల్ గెలల దిగుబడి తక్కువగా ఉంటుంది. ఈ సమయంలోనే ధర ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం టన్ను ధర రూ.21 వేలుగా ఉంది. అయితే పలువురు రైతులు పచ్చి, పుచ్చులు ఉన్న గెలలను ఫ్యాక్టరీకి తరలిస్తున్నారు. అధికారులు, సిబ్బంది మాత్రం గెలల నాణ్యతను పరిశీలించకుండానే అన్‌లోడ్ చేసుకుంటున్నారు. దీంతో గెలల నుంచి రికవరీ అయ్యే నూనె శాతం తగ్గి.. మంచి గెలలు తెచ్చిన రైతులు కూడా నష్టపోయే ప్రమాదం ఉంటుంది. ఏడాది మొత్తం రైతుల శ్రమ ఈ మూడు నెలల్లో ఆవిరైపోయే ముప్పు పొంచి ఉంది.

ఇదేం కొత్త కాదు..

ప్రస్తుతం అన్ సీజన్ కావడంతో దమ్మపేట మండలం అప్పారావుపేట ఫ్యాక్టరీని నడపకుండా అశ్వారావుపేట ఫ్యాక్టరీని మాత్రమే నడుపుతున్నారు. దమ్మపేట మండలంలో సన్న, చిన్నకారు రైతులు టన్నులోపు గెలలను అప్పారావుపేట ఫ్యాక్టరీకి చేర్చితే అక్కడి నుంచి రోజుకోసారి అశ్వారావుపేట ఫ్యాక్టరీకి ఆయిల్‌ఫెడ్ అంతర్గత రవాణా చేస్తోంది. ఇలా నిత్యం 30 నుంచి 40 టన్నుల గెలలు అప్పారావుపేట నుంచి అశ్వారావుపేట ఫ్యాక్టరీకి వస్తాయి. టన్నుకు మించి గెలలున్న రైతులు నేరుగా అశ్వారావుపేట ఫ్యాక్టరీకే తరలించాల్సి ఉంటుంది. ఇలా రోజుకు 300 నుంచి 450 టన్నులు అశ్వారావుపేట ఫ్యాక్టరీకి వస్తాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం గత సోమవారం అశ్వారావుపేట ఫ్యాక్టరీలో అన్‌లోడ్ చేస్తున్న మూడు ట్రాక్టర్లను పరిశీలించగా ఒక్కో ట్రాక్టర్‌కు పది వరకు పచ్చి గెలలు, పుచ్చు గెలలు ఉన్నాయి. ఇలా నిత్యం 10 నుంచి 20 శాతం పచ్చి, పుచ్చు గెలలు వస్తే రైతులకు గిట్టుబాటు ధర దక్కదు. గతంలో ట్రాక్టర్లలో గెలలు తరలించే క్రమంలో మధలో భారీ రాళ్లు పెట్టి కార్పొరేట్ రైతులు పంపేవారు. వీటిని కన్వేయర్ వద్ద తొలగించేవారు. ఆ తర్వాత సూపర్‌వైజర్లను ఏర్పాటు చేయడంతో రాళ్ల రవాణా తగ్గుముఖం పట్టింది. ఇక కొంతకాలంగా వేసవిలో పచ్చి, పుచ్చు గెలల రవాణా పరిపాటిగా మారింది. గెలలను నరికి లోడ్ చేసే ముఠాకు టన్నుల వారీగా చెల్లింపులు ఉంటాయి. యజమాని లేకుండా గెలలు నరికే క్షేత్రాల్లో పచ్చి, చచ్చు, పుచ్చు గెలలు లోడ్ చేసి పంపుతారు. ముఖ్యంగా అధిక ధర ఉన్నప్పుడు కౌలు రైతులు ఇలాంటి గెలలు తరలిస్తారనే ఆరోపణలు ఉన్నాయి.

బెదిరింపులు.. తాయిలాలు

గెలలు దిగుమతి చేసే సమయంలో కూలీలు పచ్చివాటిని గుర్తించి పక్కన పెడితే కొందరు రైతులు వారిని బెదిరిస్తున్నారని తెలుస్తోంది. దిగుమతి సమయంలో సూపర్‌వైజర్ ఉన్నా ఉపయోగం లేదు. 'మేం తలుచుకుంటే మీ ఉద్యోగాలుండవు' అంటూ కొందరు రైతులు బెదిరిస్తుండడంతో చిరుద్యోగులు ఏమీ చేయలేకపోతున్నారు. ఒకవేళ వారు చెప్పినట్లు నడుచుకుంటే నజరానాలు కూడా కురిపిస్తారు. గతంలో ఈ దందా సాయంత్రం వేళల్లో ఎవరూ చూడకుండా చేస్తే.. ఇప్పుడు మాత్రం పట్టపగలే సాగుతోంది. పచ్చి గెలల బాగోతం హమాలీ నుంచి మేనేజర్ దాకా తెలిసినా నోరు మెదపకపోవడం గమనార్హం.

పచ్చి, పుచ్చు గెలలు వేస్తే..

పచ్చి, పుచ్చు గెలలు క్రషింగ్ చేస్తే వాటిలో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో సుమారు 30 శాతం వరకు నూనె ఉత్పత్తి తగ్గుముఖం పడుతుంది. ఏడాదిలో మూడు నెలల పాటు రికవరీపై దుష్ప్రభావం పడితే అది ఏడాది నూనె ధరపై ప్రభావం చూపుతుంది. ఆయిల్‌ఫెడ్‌కు క్షేత్ర స్థాయిలో సిబ్బంది లేకపోవడంతో రైతులు, ముఠా ఇష్టారాజ్యంగా గెలలు నరుకుతున్నా నియంత్రణ లేదు. మిగిలిన పంటల వలె తేమ, పక్వం పరిశీలించే యంత్రాలను ఆయిల్‌ఫెడ్ వినియోగించకపోవడం ఈ దుస్థితికి మరో కారణం.

పరిశీలించి వెనక్కి పంపుతున్నాం



ఫ్యాక్టరీకి వచ్చే గెలలను పరిశీలించాకే అన్‌లోడ్ చేయాలని సిబ్బందికి చెబుతున్నాం. రైతులు, సిబ్బంది కుమ్మక్కయ్యారనే విషయం మా దృష్టికి రాలేదు. పచ్చి గెలలు, చచ్చు గెలలుంటే నిర్మొహమాటంగా వెనక్కు పంపుతున్నాం. పూర్తిగా పక్వానికి వచ్చాకే గెలలను ఫ్యాక్టరీకి తీసుకురావాలని రైతులను కోరుతున్నాం.

– నాగబాబు, ప్లాంట్ మేనేజర్, అశ్వారావుపేట

క్లుప్తంగా

పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈ నెల 20వ తేదీ నుంచి సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో జరిగే పది, ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు 720 మంది ఉండగా మూడు పరీక్ష కేంద్రాలు, 826 మంది ఇంటర్ విద్యార్థులకు గాను నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారని, పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అభ్యర్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, మొబైల్ తదితర ఎల్రక్టానిక్ వస్తువులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. సమావేశంలో డీఈఓ వెంకటేశ్వరాచారి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘యువిక’కు దమ్మపేట గురుకులం విద్యార్థి


ఉదయ్

దమ్మపేట/నేలకొండపల్లి: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ నిర్వహిస్తున్న యువ విజ్ఞాని కార్యక్రమ్ (యువిక)కు నేలకొండపల్లి మండలంలోని బైరవునిపల్లికి చెందిన విద్యార్థి బారి ఉదయ్ ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన బారి వెంకన్న–సునీత దంపతుల కుమారుడు ఉదయ్ దమ్మపేటలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ పాఠశాల విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఆసక్తి పెంచేందుకు ‘యువిక’ కార్యక్రమం నిర్వహిస్తుండగా 15రోజుల శిక్షణకు ఆయన ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఉదయ్‌ను జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఎం.ధనలక్ష్మి, గ్రామస్తులుపోలంపల్లి నాగేశ్వరరావు, మరికంటి ఉమ తదితరులు అభినందించారు.

ఆఫ్‌టైప్ మొక్కలకు నష్టపరిహారం ఇవ్వాలి


ధర్నా చేస్తున్న ఆయిల్‌పామ్ రైతులు

అశ్వారావుపేటరూరల్: ఆఫ్‌టైప్ మొక్కలతో తీవ్రంగా నష్టపోయిన పామాయిల్ రైతులకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ ఆయిల్‌పాం రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ కొక్కెరపాటి పుల్లయ్య డిమాండ్ చేశారు. మండలంలోని నారంవారిగూడెంలోని ఆయిల్‌ఫెడ్ డివిజనల్ కార్యాలయం వద్ద రైతులు మంగళవారం ధర్నా చేయగా.. ఆయన మాట్లాడారు. ఆయిల్‌ఫెడ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులకు అందించిన ఆఫ్‌టైప్ మొక్కలతో తీరని నష్టం వాటిల్లిందని, బాధిత రైతులను గుర్తించి తక్షణమే నష్ట పరిహారం అందించాలని కోరారు. అశ్వారావుపేట, అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీల పరిధిలో ఆయిల్ రిఫైనరీ యూనిట్, ఐఐటీఆర్ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయిల్‌ఫెడ్ డివిజనల్ అధికారి నాయుడు రాధాకృష్ణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యలమంచిలి వంశీకృష్ణ, అన్నవరపు సత్యనారాయణ, రైతులు తుంబూరు మహేశ్వరరెడ్డి, తలసీల ప్రసాద్, కారం శ్రీరాములు, ఆళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు వెటర్నరీ అసిస్టెంట్లకు పదోన్నతుల కౌన్సెలింగ్

ఖమ్మంవ్యవసాయం: పశు సంవర్ధక శాఖలో వెటర్నరీ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించేందుకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. జోన్–1 నుంచి జోన్–7 వరకు 373 మంది వెటర్నరీ అసిస్టెంట్ల(పశువైద్య సహాయకులు)లో అర్హులకు లైవ్ స్టాక్ అసిస్టెంట్లు(పశుసంపద సహాయకులు)గా పదోన్నతి కల్పిస్తారు. జోన్–4లోకి వచ్చే హన్మకొండ, వరంగల్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల నుంచి 46 మంది అర్హత సాధించగా, బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఖమ్మం జిల్లాకు సంబంధించి కౌన్సెలింగ్‌లో జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.వెంకటనారాయణతో పాటు మరో అసిస్టెంట్ డైరెక్టర్, కార్యాలయ మేనేజర్ పాల్గొని, రోస్టర్ ఆధారంగా పదోన్నతుల ప్రక్రియ పూర్తిచేస్తారు.

బొలేరో వాహనం బోల్తా

చర్ల: మండలంలోని దండుపేటలో మంగళవారం రాత్రి మిర్చి లోడుతో వెళ్తున్న బొలేరో వాహనం బోల్తా పడింది. చర్లకు చెందిన టీఎస్28 టీపీ 1573 నంబర్ గల బొలేరో వాహనం కొత్తపల్లి నుంచి మిర్చి లోడుతో గుంటూరుకు బయలుదేరింది. దండుపేట మూలమలుపు వద్ద అదుపుతప్పి ప్రధాన రహదారిపై బోల్తా పడింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.21,000

అకాల వర్షం.. ఆగమాగం..


ఇల్లెందు మండలం కొమరారంలో నేలవాలిన మొక్కజొన్న పంట

ఇల్లెందురూరల్/అశ్వారావుపేటరూరల్/గుండాల/పాల్వంచరూరల్/టేకులపల్లి: జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులతో చేతికందే దశలో ఉన్న పంటల నేలరాలాయి. ప్రధానంగా ఇల్లెందు, అశ్వారావుపేట, గుండాల, ఆళ్లపల్లి, చంద్రుగొండ, దమ్మపేట, పాల్వంచ, టేకులపల్లి తదితర మండలాల్లో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరి పంట గింజదశకు చేరకోగా భారీ వర్షాలతో పంట నీటమునిగింది. మామిడికాయలు నేలరాలాయి. మొక్కజొన్న 50 శాతానికి పైగా కోయగా, మిగిలిన పంట గాలిదుమారంతో నేలవాలింది. కోసిన మొక్కజొన్నలు సైతం కల్లాల్లో ఆరబెట్టగా వర్షాలతో తడిసి ముద్దయ్యాయి. నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షంతో కొన్ని ప్రాంతాల్లో మొక్కజొన్న గింజలు మొలకలు వస్తున్నాయి. అశ్వారావుపేట మండలంలో ఈ మూడింటితో పాటు వేరుశనగ, ముగన, కూరగాయల పంటలు సైతం దెబ్బతిన్నాయి. గుండాల మండలంలో పంటలతో పాటు ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయి పలువురు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై భారీ వృక్షాలు విరిగిపడి రవాణాకు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు విరిగిపడి అనేక గ్రామాల్లో సరఫరాకు అంతరాయం వాటిల్లింది. నష్టపోయిన తమకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు, బాధితులు వేడుకుంటున్నారు. అయితే మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు మాత్రం జిల్లాలో వరికి పెద్దగా ముప్పు వాటిల్లలేదని, మొక్కజొన్న పంటకు మాత్రం కొంతమేర నష్టం జరిగిందని చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 7,562 ఎకరాల్లో మామిడి సాగు కాగా, అందులో 20 శాతం మేర నేలరాలినట్లు అంచనా వేస్తున్నారు.

టేకులపల్లి: మండలంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపుల కారణంగా మొక్కజొన్న, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. గంగారం, సంపత్‌నగర్, చింతోనిచెలక, బోడు గ్రామాల్లో మామిడి కాయలు రాలిపడ్డాయి.


పోలారంలో మొక్కజొన్నను పరిశీలిస్తున్న అధికారులు


గుండాల మండలం సాయనపల్లిలో విరిగిన మొక్కజొన్న మొక్కలు


నడిమిగూడెంలో రోడ్డుపై ఆరబోయగా తడిసిన మొక్కజొన్నలు


టేకులపల్లి: చింతోనిచెలకలో రాలిన మామిడి కాయలు


గాలి దుమారంతో ధ్వంసమైన మునగ తోట


అశ్వారావుపేట మండలంలో నేలమట్టమైన కాకర తోట


అశ్వారావుపేట - భద్రాచలం రోడ్డుపై కూలిన భారీ వృక్షం

ఆర్టీసీకి నవమి ఆదాయం రూ.92 లక్షలు

గతేడాది కంటే రూ.16 లక్షలు అదనం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగిన శ్రీరామనవమి వేడుకలకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు ముందస్తు ప్రణాళికతో రెగ్యులర్ సర్వీసులే కాక అదనపు సర్వీసులను కూడా నడిపించారు. భద్రాచలం డిపోకు గతేడాదితో పోలిస్తే ఈసారి ఆదాయం పెరిగిందని డిపో మేనేజర్ తిరుపతి వెల్లడించారు. భద్రాచలం డిపో నుంచి వివిధ రూట్లలో అదనంగా 78 బస్సులు నడిపించగా, అన్నీ కలిపి ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు మొత్తం 1,52,188 కిలోమీటర్లు నడిచాయని, రూ.92.61 లక్షల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. మొత్తంగా 82,138 మంది ప్రయాణించగా, అందులో 37,639 మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఉపయోగించుకున్నారని తెలిపారు. గతేడాదితో పోలిస్తే రూ.16.76 లక్షల ఆదాయం అదనంగా రాగా, 13,834 ప్రయాణికులు అదనంగా బస్సుల్లో ప్రయాణించారన్నారు. కాగా, ఎండల నేపథ్యాన ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బందికి పలువురు దాతలు మజ్జిగ, పానకం, పులిహోర, అన్నదానం చేసి సహకరించారని డిపో మేనేజర్ తిరుపతి వివరించారు.

ఫుడ్ లైసెన్స్ సర్టిఫికెట్ ఉండాల్సిందే..

కొత్తగూడెంఅర్బన్: ఆహార సంబంధిత వ్యాపారం చేసే ప్రతి ఒక్కరూ ఫోస్టాక్ ఫుడ్ సేఫ్టీ శిక్షణ సర్టిఫికెట్ తప్పనిసరిగా పొంది ఉండాలని డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, ఫోస్టాక్ ట్రైనర్ ప్రవీణ్ తెలిపారు. పాన్ ఇండియా ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ భాగస్వామి, జాతీయ ఆహార భద్రత సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న, ఆమోదించిన ఫోస్టాక్ శిక్షణ, సర్టిఫికెట్ కార్యక్రమం మంగళవారం డీఎంహెచ్‌ఓ సమావేశపు హాల్‌లో నిర్వహించగా.. వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కల్తీని గుర్తించాలని తెలిపారు. ఎవరైనా ఫుడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తినుబండారాలకు సంబంధించి దుకాణదారులు, వ్యాపారులంతా ఫుడ్ లైసెన్స్‌తో పాటు ఫోస్టాక్ ట్రైనింగ్ సర్టిఫికెట్‌ని కలిగి ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కేవీజీవీఎం సౌత్ ఇండియా ఇన్‌చార్జులు టి.సింధు, ఇ.మోహన్‌బాబు, కొత్తగూడెం జిల్లా టీం హెడ్ శివకల్పన, జిల్లా ఎగ్జిక్యూటివ్‌లు సోహెల్, యాకూబ్, శేఖర్, షఫీ, సమీర్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న శిక్షణ బృందం

ఎక్కడి చెత్త అక్కడే..

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో రావడంలో రెండు రోజుల పాటు పారిశుద్ధ్య పనులకు ఆటంకం కలిగింది. దీంతో దేవస్థానం చుట్టూ ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. అపరిశుభ్రత తాండవిస్తోంది. క్యూలైన్లు, పురవీధుల్లో చెత్తాచెదారం కుప్పలుగా పడి ఉంది. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు దుర్గంధం భరించలేకపోతున్నారు. భక్తులకు అందజేసేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ప్యాకెట్ల బస్తాలను అలాగే వదిలేయడంతో చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. వీధుల్లో చెత్త వేయడానికి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డ్రమ్ములను తరలించకపోవడంతో అందులో నుంచి దుర్వాసన వెదజల్లుతోంది. కరకట్టపైన, చెట్ల కింద చెత్త అలాగే పేరుకుపోయింది.


ఆలయ సమీపంలో డ్రమ్ముల్లో నిల్వ ఉన్న చెత్త


క్యూలైన్ల పక్కన పేరుకుపోయిన చెత్త


అన్నదాన సత్రం ముందు..

స్లాట్ ఉంటేనే రిజిస్ట్రేషన్

- ప్రతీ డాక్యుమెంట్‌కు ఈనెల 10 నుంచి తప్పనిసరి
- పైలట్ ప్రాజెక్టుగా ఉమ్మడి జిల్లాలోని మూడు కార్యాలయాలు

ఖమ్మంమయూరిసెంటర్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతీ డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ పారదర్శకంగా ఉండేలా చేస్తూనే త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈనేపథ్యంలోనే డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుకింగ్ విధానాన్ని తప్పనిసరి చేస్తున్నట్లు ఇటీవల రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా.. తొలుత 19 కార్యాలయాల్లో ఈనెల 10వ తేదీ నుంచి నూతన విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలుచేయనున్నారు. ఈ జాబితాలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి మూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్థానం దక్కింది.

మూకుమ్మడిగా చేయకుండా..

ప్రస్తుతం ఎవరు ముందు వస్తే వారు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. అంతేకాక దళారులు పదుల సంఖ్యలో డాక్యుమెంట్లు తీసుకొచ్చి వరుసగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటుండడంతో మిగతా వారి వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో స్లాట్ బుకింగ్ విధానం అమలుచేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో 19 కార్యాలయాలను పైలట్‌గాఎంపిక చేయగా.. ఖమ్మం ఆర్‌ఓ(జాయింట్ సబ్ రిజిస్ట్రార్) కార్యాలయం, కూసుమంచి, కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈనెల 10వ తేదీ నుంచి నూతన విధానం అమలు కానుంది. ఈ విధానంతో ఒక స్లాట్‌లో ఒకే డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ జరుగుతుందని చెబుతున్నారు.

చేతబడి నెపంతో వ్యక్తి హత్య

మృతదేహాన్ని చెరువులో పడేసిన వైనం



మృతదేహాన్ని బయటకు తీస్తున్న గజఈతగాళ్లు (ఇన్ సెట్‌లో) కొమరం రాముడు (ఫైల్)

దుమ్ముగూడెం: మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో ఇంకా చేతబడులంటూ కొందరు హత్యలు చేస్తున్నారు. జడ్.వీరభద్రాపురం గ్రామానికి చెందిన కొమరం రాముడు(53)ను చేతబడి చేస్తున్నాడనే నెపంతో ఉరి వేసి చంపి, గోనె బస్తాలో కుక్కి, చెరువులో పడేసిన అమానవీయ ఘటనకు సంబంధించి సీఐ అశోక్ మంగళవారం వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన కొమరం రాముడు గత మార్చి 11వ తేదీన గ్రామంలో జరిగిన వివాహానికి భార్యతో కలిసి వచ్చాడు. అనంతరం భార్య ఇంటికి వెళ్లగా రాముడు రాకపోవడంతో ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో మార్చి 16న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన కొమరం వెంకటేశ్, మణుగూరు మండలం చిన్నరావిగూడెంవాసి పద్దం బాలరాజు మంగళవారం తామే హత్య చేశామని పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. కాగా, రెండు నెలల కిందట వెంకటేశ్ తమ్ముడు కొమరం రాంబాబు చర్ల వెళ్తుండగా.. కొమరం రాముడు ఎట్టు వెళ్తున్నావని ప్రశ్నించాడని, చర్ల వెళ్తున్నానని చెప్పడంతో ‘నువ్వు చచ్చిపోతావ్’ అని అన్నాడని వెంకటేశ్ పోలీసులకు తెలిపాడు. చర్ల నుంచి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో రాంబాబు మృతి చెందాడని, కొన్నేళ్ల కిందట తన తండ్రి మృతి చెందాడని, తన భార్య సైతం పక్షవాతానికి గురైందని, దీనికంతటికీ కారణం కొమరం రాముడు చేతబడి చేశాడని చెప్పాడు. దీంతోనే తన బావమరిది పద్దం బాలరాజుతో కలిసి, రాముడుకు మద్యం తాగించి ఉరివేసి చంపి, గోనె బస్తాలో మూటగట్టి చెరువులో పడేశామని విచారణలో అంగీకరించాడు. కాగా, మంగళవారం గ్రామంలోని చెరువు వద్దకు వెళ్లి గజఈతగాళ్లతో చెరువులో గాలింపు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించామని సీఐ వెల్లడించారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తామని ఆయన పేర్కొన్నారు.

బియ్యం లారీ పట్టివేత

ములకలపల్లి: అనుమతి పత్రాలు లేకుండా బియ్యం తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ కిన్నెర రాజశేఖర్ కథనం మేరకు.. ఏపీలోని విస్సన్నపేట నుంచి ఛత్తీస్‌గఢ్‌కు 34 టన్నుల బియ్యం లోడుతో వెళ్తున్న లారీని మండలంలోని జగన్నాపురం శివారులో పోలీసులు పట్టుకున్నారు. ‘వేబిల్లు’లేకపోడం, బియ్యం తరలింపు పత్రాలు పూర్తిగా లేకపోవడంతో లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. పౌరసరఫరాల శాఖ డీటీ సుంకర శ్రీనివాస్ లారీని పరిశీలించి, బియ్యం శాంపిళ్లను సేకరించారు. శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించనున్నామని, నివేదిక వచ్చాకే రేషన్ బియ్యమా? కాదా? అని తేలుతుందని, తర్వాత చర్యలు తీసుకుంటామని డీటీ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఇల్లెందు: ద్విచక్రవాహనం పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని సత్యనారాయణపురంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గోనెల సిద్ధయ్య (79) గత నెల 31న ద్విచక్రవాహనం పైనుంచి పడ్డాడు. తీవ్రంగా గాయడపటంతో ఖమ్మం, హైదరాబాద్ తరలించి వైద్యం అందించారు. పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడు. సిద్ధయ్యకు భార్య ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సూర్య కేసు నమోదు చేశారు.

మామిడిగూడెంలో..

చర్ల: మండలంలోని మామిడిగూడెంలో గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కారం జయంత్ మంగళవారం మృతి చెందాడు. ఆస్పత్రి నుంచి ఆయన మృతదేహాన్ని భద్రాచలంలోని స్వగృహానికి తరలించారు.

వేర్వేరు ఘటనల్లో ఆరుగురు ఆత్మహత్యాయత్నం

పాల్వంచ: వేర్వేరు ఘటనల్లో ఆరుగురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా వారి బంధువులు పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం మంగళవారం చేర్పించారు. వీరందరూ కుటుంబ సమస్యల నేపథ్యంలోనే ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది. పాత పాల్వంచకు చెందిన కె.శ్రీనివాస్ కలుపు మందు తాగగా, ములకలపల్లికి చెందిన టి.శ్రీలక్ష్మి అధిక మోతాదులో మాత్రలు మింగింది. అలాగే, ముత్యాలంపాడుకు చెందిన రమాదేవి, రంగాపురానికి చెందిన కె.కల్యాణి పురుగుల మందు తాగారు. అంతేకాకుండా తెలంగాణ నగర్‌కు చెందిన ఎం.ఝాన్సీ మాత్రలు మింగింది. వీరిలో నలుగురు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, ఇంకో ఇద్దరిని మెరుగైన చికిత్స నిమిత్తం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

పాల్వంచరూరల్: డబ్బు విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని బంద్రుగొండ శివారులో మంగళవారం ఇరు వర్గాల వారు పోగుచేసిన రూ.13 లక్షల విషయంపై చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాలు మధ్య వాగ్వాదం జరిగింది. ఇది ఘర్షణకు దారితీసింది. ఓ వర్గానికి పాకల వెంకట్రావ్.. మరో వర్గానికి చెందిన ఇట్టి వెంకట్రావ్, నిమ్మల రాంబాబుపై దాడి చేసినట్లు సమాచారం. వారిని ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. ఈ ఘటనపై ఎస్‌ఐ సురేశ్‌ను వివరణ కోరగా ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇట్టి వెంకట్రావ్, నిమ్మల రాంబాబును ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పరామర్శించారు.

కారు పల్టీ.. దంపతులకు గాయాలు

సుజాతనగర్: కారు పల్టీ కొట్టిన ఘటనలో దంపతులకు తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. హైదరాబాద్‌కు చెందిన బుచ్చిరాజు – దేవి దంపతులు కారులో భద్రాచలం వెళ్తున్నారు. ఎదురుగా ఓ వాహనం డివైడర్ పక్క నుంచి యూటర్న్ తీసుకుంటుండగా గమనించిన బుచ్చిరాజు వాహనాన్ని అదుపుచేసే క్రమంలో ఒక్కసారిగా పల్టీ కొట్టింది. ప్రమాదంలో దంపతులకు గాయాలు కాగా 108లో కొత్తగూడెం.. అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు.

గుర్తు తెలియని బైక్ స్వాధీనం

పాల్వంచ: జామాయిల్ తోటలో నాలుగు రోజులుగా గుర్తు తెలియని మోటార్ సైకిల్ ఉండటం చర్చనీయాంశంగా మారింది. బీసీఎంరోడ్‌లోని ఓ జామాయిల్ తోటలో బైక్‌ను స్థానికులు గుర్తించారు. నాలుగు రోజులుగా ఉందని రూరల్ పోలీసులకు సమాచారం అందించగా.. వారు వచ్చి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. బండి నంబర్ ఆధారంగా చిరునామా తెలుసుకునేందుకు యత్నించగా.. ఆన్‌లైన్‌లో కనిపించలేదని పోలీసులు తెలిపారు.

పూరిల్లు దగ్ధం

ములకలపల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన మంగళవారం మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాల్దా అరుణమ్మ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి, ఇంట్లో ఉన్న అరుణమ్మను బయటికి తీసుకొచ్చారు. మంటలను గ్రామస్తులు అదుపులోకి తెచ్చారు. నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయి.

అమ్మా.. ఇక నువ్వు లేవవా?

మృతి చెందిన ఆవు వద్ద లేగదూడ నరకయాతన


చనిపోయిన ఆవు వద్ద దూడ

అశ్వాపురం: అశ్వాపురం మండలం రామచంద్రాపురం జీపీ శివలింగాపురం పల్లె ప్రకృతి వనం సమీపాన వేటగాళ్ల అమర్చిన ఉచ్చులో చిక్కుకుని ఆవు మృతి చెందింది. మల్లెలమడుగు జీపీ వలస ఆదివాసీ గుంపునకు చెందిన సోడె లక్ష్మయ్య ఆవు నాలుగు రోజులుగా కానరాకపోగా, మంగళవారం శివలింగాపురంలో చనిపోయి కనిపించింది. అయితే, నాలుగు రోజులుగా తల్లి కనిపించక 20రోజుల వయస్సు కలిగిన లేగ దూడ తల్లడిల్లుతోంది. ఇంతలోనే ఆవు మృతి చెందిందనే సమాచారంతో రైతు కుటుంబం వెళ్తుండగా వారితో పాటు వచ్చిన లేగ దూడ తల్లిని తట్టి లేపేందుకు, పాలు తాగేందుకు యత్నించడం అందరినీ కలిచివేసింది.

మోటార్ సైకిల్ చోరీపై కేసు

టేకులపల్లి: మోటార్ సైకిల్ చోరీపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ సురేశ్ కథనం ప్రకారం.. పాల్వంచ సాయినగర్‌కు చెందిన మున్సిపాలిటీ వర్కర్ గంగాపురి దుర్గాప్రసాద్ ఈ నెల 4న బైక్ (టీఎస్ 04 ఈబీ 5852)పై వచ్చి.. మండలంలోని ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లోని మాలోత్ రాందాస్ ఇంటి వద్ద బైక్ పెట్టి డోర్నకల్ వెళ్లాడు. మరుసటి రోజు వచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదు. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.